అతడు—ఆ వీరుడు-మందిలో మాయమైపోయినాడు. మంది వంక చూచింది 'దిక్సూచి' మందిలో ప్రతీమనిషి చేతిలోనూ ఆ వీరుని చిరునామాచీటీయే.

గాడి టిక్కెట్టు ఓచేత ఆవీరుని చిరునామాచీటీ వోచేత పెట్టుకొని ప్రతీ ప్రయాణీకుడు ఆపూట ఆ డిసెల్ తుదిగమ్య స్థానంలో దిగినట్టే గోచరించింది 'దిక్సూచికి!'

... ... ... ... ...

## ఇది దానిదే

తెల్లవారింది, వేసంకాలం కావడం చేతను వెంట వెంటనే ఎండకాంతి ఎండకాంతితోపాటు తొందరగా పనులు నెరవేర్చుకోవడము తబ్బిబ్బు ఏకమౌతూ రోడ్డుకడ్డంగా ఒక పదిమంది రిక్షావాళ్ళు తమతమ ఉత్తబళ్ళయొక్క పిడికిటపట్టి కడ్డీలమీద తమతమ చేతులుంచుకు నిలబడివుంటారు ఏమీపనిలేక. వారిలో ఒకడు మాత్రము ఏమరుపాటు నగపించేడు. తనను తన హేండిల్ బారును తన రిక్షానుకూడా మరిచిపోయాడు. ఆదోరీతిగా ఒక రయిక కాలి మునివ్రేళ్లతో రోడ్డుమీదనుంచి పైకెత్తి తన రెండుచేతులా అర బట్టినట్టు పట్టుకుంటూ ఊఁ-చూస్తూవున్నాడు దాని గళ్ళకేసి నాణ్యతకేసి.

రోడ్డుమీద వాడికి దొరికిందీ అంటే ఆరోడ్డు ఇంకా తుడువ బడలేదు అన్నమాటే! ఉదయం ఎనిమిది అయితేగాని తుడిచే వాళ్లు రారు. ఆదారినిపోరు. కాని బాటసారులు అపరిమితంగా అప్పటికప్పుడే నడుస్తూవుంటారు. అది మహా జనరస్తా. అస్తమానం వస్తూపోతూనే వుంటారు జనం ముప్పొద్దూ! ఏదో రైలుకని సినిమాకని సరదాకనీ.

అయితే అలా రయిక నేలను పడివుండడం అదే మొదటి సారి ఆదార్ని. ఒకడు పరకాయిస్తుంటే రెండోవాడు! రెండోవాడు

పరకాయిస్తుంటే మూడోవాడు! ఇలా అక్కడ నించున్న పది పండ్రెండుమంది రిక్షావాళ్లు వాళ్ళ అసలువృత్తిమాని "ఈ రయిక ఎవరిదై వుంటుంది" అనే విచికిత్సలో పడ్డారు.

గడియారం తొమ్మిది కొట్టినా ఎవనికీ ఆ సమస్యవిడలేదు. చివరకు దాన్ని అంతా పోచపోచ పరీక్షించి పరిపరివిధాల ఆలోచింపసాగారు. "బీదవాళ్లు భాగ్యవంతులు కావడంతోటే ఇలాటి రైకలిక్కడ పారేసి పోయేరు" అని ఒకడంటే "మరొకడు భాగ్యవంతుల్లో మాత్రం వయస్సువచ్చినవాళ్ల రయికలు ఇలాగ్గా నిమిషనిమిషానికి చిరిగిపోయేవి ఉండవా?" అన్నాడు.

ఈ కడమాట వినడంలో నాకు బిల్హణకవి వాక్కు "నమత యౌవనం" అనేది జ్ఞాపకం వచ్చింది. దాని పరమందున్న చరణంకూడా నమ్మకంగా తట్టింది. "నిజంగా యౌవనమన్నది ప్రతీవాళ్ళలోనూ క్షణక్షణం విజృంభించడానికవకాశముంది. దానికి భాగ్యం యోగ్యత ఇన్ని అక్కరలేదు. అదో ఏపు అదో రూపు" అని ఇలాగ విలాసపుటూహలు ఎదలో తోచాయి.

అలా ఆ రిక్షావాళ్ళు ఆ రయికను చిరుగు చిరుగును గడిగడి పరిశీలిస్తూనే వున్నారు. నేనో కథ అల్లాను. సినిమాలో లోపలి వాళ్లు ఒక కథ తెరమీద చూస్తూవుంటే జగన్నాటక సూత్రధారుడు ఈవల తెరలేకుండానే మరోకథ అంత కెక్కువైంది చూపాడు నాకు ఆ చిరుగులగుండా.

అలాంటి చిరుగుల రైక తన ఒంటిమీద నుండేకన్న అసలు ఏమీలేకుండా వుంటేనే మెరుగనిపించేదేమో! అందు చేతనే ఆ మత్తకాశిని దాన్ని అక్కడ పారేసివుండి వుంటుందని నానమ్మకం. దాన్ని అలా అలా రిక్షాచక్రం తీసుకువచ్చి యిక్కడ వదిలేసివుంటుందని నా తీర్మానం. ఎంత ఆలోచించినా వర్త మానాన్ని వదలి భవితవ్యంలో పడాలనే వూహపోదు. సత్య వ్యవహారమునుండి ఊహవబోధ గావించుకుందామనే తత్వం

నాకు రావడంలేదు. అంచేత ఇంకా చిరుగుల రైకనే పాఠకులకు చూపిస్తూవున్నాను. అమాంతంగా ఏరైకా తొడగని అప్సరస లోకంలోకి అడుగు పెట్టలేకుండావున్నాను. అప్సరసలున్న లోకం వేరే వున్నదా? ఇదేనా? అని అనిపించే అందం, ఆనందం ఇక్కడే ఈక్రిందే కనిపించేటప్పుడు అటువంటి కాంక్షబుట్టడం కూడా అనవసరమేమో?

సరిగా పరిశీలిస్తే ఆ రయిక ధరించిన అంగన తప్పకుండా అనంగుడి భార్య అయినా కావాలిలేక వానియొక్క ఉంపుడికత్తె ఐనా కావాలి. ఆ యిద్దరూ కాకపోతే అనంగుడు ప్రేమించి విఫలుడైన అవివాహిత అయినా కావాలి. కడమాట నిజమై యుండాలి. రయికతోపాటు ఏతాళీ తెగిన జాడలేదు. రయిక యొక్క హద్దుపద్దు యోచిస్తే సరిగ్గా పదిహేనేళ్ళపిల్ల కమిరేటట్టుగా వుంది. ఏదో "ఫోక్‌సాంగ్" లో అన్నాట్ట ఒకడు; "దుమికితే లేడిలాగు దుముకాలి, ఉరిమితే పులిగొంతుకులా గురమాలి, ఉంటే నా ప్రేయసియొక్క నునుదోయిలా గుండ్రంగా గుత్తంగా వుండాలి" అని. సరిగా ఆ రయిక తొడుక్కుంటే ఆ పిల్లకే అమిరేదనుకుంటాను. అయితే చిరిగిన రయిక ఆమె తొడుక్కుంటుందా?

ఇప్పుడు నాకు కొంచెం కొంచెం తట్టుతూవుంది ఆపిల్ల ఎవరైవుంటుందో అని. ఆ పిల్లయొక్క అందంతో సరిపోల్చి చూదామా అంటే ఏవొక్క స్త్రీ అందం చాలదు. వెయ్యిన్నూటొక్క యువతుల అందచందాల నన్నిటినీ గమనించి వాళ్ళల్లో నున్న మెరవడినంతా తీసి ఒక ఒరవడిగా చూపాడేమో బ్రహ్మ ఆమెయొక్క స్ఫురద్రూపంలో? అనేకమందిని చూచేవుంటారు మీరున్ను. పాఠకులు ఈపాటికి తుడుపుడు కత్తెలనుంచి ముదుపులు చెల్లించేవాళ్ళదాకా! ఒక్కొక్కతెరవ కొక్కొక్క హొయ! కాని నేవర్ణిస్తూవున్న పిల్ల అందంవుందే అది అన్ని హొయల్లోనూ

కూడివున్నదైయుంది. పొడుక్కి పొడుగూ, ఉరవకు ఉరువూ, కరువుకు కరువూ, అన్నీకూడా తనయొక్క అవయవ శోభలోనే చూపిస్తూ, అంతనూ ఒకానొకమైకంకప్పె ఛాయతో కూడకట్టుకొన్నదై తోడుగా ఎవరైనా తగిన మగవాడు తనకు దొరుకుతాడు అన్నంత ఈడొచ్చి లోకంలో కీడుదలపని మనిషి ఆమె వొక్కర్తే. ఆమె వొక్కర్తే రిక్షాయెక్కితే చూడనివాడు లేడు. ఎక్కుతూంటేను చూస్తారు, ఎక్కాకచూస్తారు ఆమెను! అదేం పాపమో? పోనీ నడుస్తుందా నడిచినా ఆమె నీడనే పొందుగంటూ నడిచేవాళ్ళూ వున్నారు. పోనీ మోటారుకారులో ప్రయాణిస్తుంది. అప్పుడూ కూడా అంతే! అది ఎంత గబగబాపోతే అంత గబగబా చూపుల్ని విసరుతారు ప్రజ. ఏరోప్లేనులో వెడితే ఏరోప్లేనులో ఈత్తూపోతే ఈత్తూ ఆమె నిట్టూర్పుల నొకప్పుడు ఆమె కెరటాల నొకప్పుడు మూటకట్టుకుంటూ వుంటారు కొందరు వెర్రివేపకాయలు.

నేను వ్రాసేదంతా "మేక్ అప్పా" లేక అస్సలైనశరీరమా? అని సందేహిస్తూవున్నారేమో పాఠకులు. సందేహిస్తే సందేహించవచ్చు. నేనే సందేహించేటప్పుడు వారు సందేహించడంలో అబ్బురంలేదు.

కాని "మేక్ అప్" ను కలం వ్రాయదు. కుంచేవ్రాస్తుంది. అందం అపురూపం యిలాంటి వున్నాయే ఇవి కలానికి చెందినవే కాని కుంచెకు చెందినవికావు. కుంచెకు చెందినవల్లా వెలుగు నీడలులేక రంగు రామణీయకాలూ. ఇంకాపోతే నిమ్నోన్నతాలు. అంతేగాని అందం అన్నప్పుడు అపురూపం అన్నప్పుడు అవస్తువును గురించి కవి వ్రాసిందే వ్రాత. అంచేత యిక్కడ ఈమెను గురించిన వర్ణనమంతా కవికి అప్పగించివేశాను. ఒకానొక కవిని గూడా తీసుకువెళ్ళి ఆమెను చూపించి వర్ణించమని అప్పుడాతడు చెప్పిన పలుకులు మీరువిని ఆమెను గురించి అలోచించండి అప్పుడు తెలుస్తుంది ఆమె మీకు! అందాకా తెలియదు.

"ఇది దానిదేరా! అది వీడితో లేచిపోతూ మంచిరయిక తొడుక్కుని ఈ చినిగిన రయిక అక్కడ పారేసింది. ఆపాత నీ సైకిలురిక్షా చుట్టబెట్టుకు వచ్చేసింది" అన్నాడు తుదకో రిక్షావాడు. మాయమాటలో నిజంమాటలో! అని నేనిమిషం అక్కడే నిలబడ్డాను. ఒక పాత్రసామాను అమ్మేవాడు అలా పోతున్నాడు. "ఏమబ్బీ! నీదిగానీగా ఆ చిరుగులగుడ్డ?" అని అడిగాడు. వాడు ఆ అమ్మేవాడు దూరంగా దుమికి "అదెవరిదో? నాదగ్గర చిరుగులపాత లుండవుబాబా! నేను పాత్రసామాను లమ్మితే గట్టిగుడ్డలకే అమ్ముతాను. అబ్బే! అది కుట్టినాడుది పనిచేయదు. చింపాలని చింపింది కాని అది దానిది చిరిగింది కాదు" అని అన్నాడు ఆ అబ్బి.

ఆ రిక్షావాళ్లు అన్యోన్యం చూచుకున్నారు. "బలవంతాన్ని లాక్కుపోయినాడురా దాన్ని వాడు" అని అనుకొన్నారు. వెంటనే ఆ రిక్షావాళ్లందరూ పరోక్షసుందోప సుందులైపోయినారు. అసలు కారణం లేకుండా పోరాడుకున్నది ఆ రిక్షావాళ్ళనే చూశానుగాని మరొకళ్లను చూడలేదు. లేచిపోయిన వాళ్లనిద్దర్నీ ఒక "బాడీ"గా యోచిస్తూ వీళ్ళల్లో ఒక పక్షంవాళ్ళు 'సపోటా' ఇచ్చారు. మరో పక్షంవాళ్లు ప్రతివిమర్శన గావించారు. ఎంతగా అన్యోన్యం వీళ్లు కలహించినా కలబడ్డా, లేచిపోయిన ఆ జంట మళ్ళా వీళ్ళకు కనిపిస్తేగా! అంచేత వారిమధ్య వాదం వేగం చల్లారిపోయింది. ఎవరి వ్యాపారంలో వారు నిమగ్నులై నిష్క్రమించారు.

అసలు కథ ఈపైనుంచి వస్తుంది. చినిగిన రయిక నక్కడ పారేసి వారు ఆ రిక్షావాళ్లందరూ కూడి, అప్పుడుగాని నాకు నిజం తెలవలేదు. అదంతా ఒక కథగా వ్రాయడానికి బుద్ధిపుట్టలేదు. వాళ్ళు అలా పారేశారు ఆ పేలికను. ఎండకు ఎండేలాగు, వానకు తడిసేలాగు తుదకేమైనా చీకిపోయి, చివికిపోయి ధూళి అయి గాలిలో కలిసిపోయే పర్యంతం అది అక్కడే వుందని మనం

అనుకోవాలి. ఈకథ చదువుతున్నంతసేపు అదే పాఠకులయొక్క దృష్టిని ఏలుతున్నట్టు తలపోయాలి.

చూడండి! హిందూమతం అంతర్వర్ణ వివాహం వొప్పుకోదు. అంచేత భిన్నభిన్న వర్ణాలవారు ప్రేమికులైనప్పుడు చేయవలసిన పనేమిటి? అసలు ప్రేమకు పెళ్లి అనేది అవసరమా? ఇవన్నీ చాలా పెద్ద ప్రశ్నలని నా వూహ! ఒకానొకడు వాయుభక్షకుడు పర్ణభక్షకుడు కావచ్చు. ఒకడు శాకాహారి కావచ్చు, ఒకడు మాంసాహారి కావచ్చు. ఒకడు మద్యం పుచ్చుకోవచ్చు. ఒకడు పుచ్చుకోరాదనే నియమముతో వుండవచ్చు. ఇలాగా భోజనాదుల్లోనే తేడాలున్నప్పుడు ప్రేమ వ్యవహారంలో తేడా పాళా లుండవు కనకనా? అందుకనే మతాచారాలు రిజిస్ట్రీలు, విడోమేరియాజ్ ఏక్టులు ఇలాంటి వన్నిని వీటన్నిటిదీ ఒకటే దృష్టి. మనస్సునకు తృప్తి, మానవునకు విశాలతరప్రాప్తి ఒనగూరుస్తాయి. అసలు రూపం అసలు రూపంగానే, అసలు ఆనందం అసలు ఆనందంగానే చెలామణీ అవుతూవుంటాయి. కాని వెనుకలేని తృప్తి వెనుకలేని ప్రాప్తి ఇప్పుడు చేకూరుతాయి.

ఇలా యోచిస్తూనే వున్నాను. అప్పుడే రంగస్థలంమీదకు వచ్చేశారు వారు. అనగా రస్తామీదకు వచ్చేశారు ఆ నాయికా నాయకులు. ఇద్దరూ చెరో 'కోచీ' ఎక్కారు. ఇద్దరూ మహమ్మదీయ మతం పుచ్చుకున్నారు. పెళ్ళికొడుకు రస్సాగా సూటు, నల్లని దళసరి బూట్సు, చేతిలో ఒక రుమాలు పట్టుకు దర్జా చూపిస్తున్నాడు. ఆడది అనగా పెళ్ళికూతురు ఏమన్నా ఒక బురకా కప్పుకొన్న పొడుగాటి అందంతో వెనక కోచీలో వుంది.

ఆ కాడకు వచ్చేసరికి ఏం జరిగిందో! మరి ముందుకు వెళ్లలేదు. పెళ్ళికొడుకు కోచీ వెళ్ళలేదు. పెళ్ళికూతురు కోచీ వెళ్ళలేదు. పెళ్లికొడుకు వెనక్కు చూశాడు. పెళ్ళికూతురు వొళ్లు నగ్నంగా కనబడుతూ బురకాను దిగవిడచి ఒక రయికకోసం

చేయిచాచినట్లయింది. పెళ్లికొడుకు "మరినీకు స్వేచ్ఛలేదు. బురకా వేసుకో! మనం ఇప్పుడు మహమ్మదీయులం" అన్నాడు. ఆమె "నిన్న నేను తొడిగిన రయిక యీ ప్రదేశమందు చిరిగిపోయి కనబడుతూవుంది. అదిక్కడ కెలావచ్చింది?" అని పృచ్ఛించింది మగనిముందు అతి నగ్నంగా తాను నిలుచుండి. "అవును. నీవు పారేస్తే సైకిలు రిక్షాను చుట్టుకువచ్చింది యీ ప్రాంతానకు. ఈ ప్రాంతానకన్న మాటేమిటి? ఏప్రాంతానకైన పోగలదు. అది హిందూమతానకు చెందింది. దాన్ని గాల్లో కలిసిపోనియ్యి. మరి అవంక చూడకన్నాడు పెళ్ళికొడుకు.

పెళ్ళికొడుకు అతీ రస్సాగా వున్నాడు. నల్లటి బూట్సు గీట్సు తొడిగి. మతంపేరిట అందాన్నంతనూ బురకాలో కప్పెట్టినట్టు కప్పెట్టి తాను ఒక మతం అవలంబించినందుకు లజ్జపడింది.

చినిగిన రయిక ఆ పెళ్లికూతురుయొక్క అందాన్ని వెక్కిరించినట్టు ఆరుబయట నిలిచివుంది. కథ కంచికి వెళ్లింది-మనం మన మంచంమీద......

...　...　...　...　...

## మనమందరం నిరపరాధులం!

తోచనప్పుడల్లా ఓసారి రైలెక్కి అటు చెన్నపట్నమో యిటు విశాఖపట్నమో చూచిరావడం పరమేశ్వరాని కలవాటు. పరమేశ్వరాని కుంటాయి 40, 45 ఏళ్లు. మగాడు కాబట్టి అనుకున్నది తడువుగా "టై" వేసుకు "స్యూట్ కేసు" పుచ్చుకు "రిస్టువాచీ" చూచుకుంటూ ఇంటి మెట్లుదిగి వెడుతూవుంటే ఇంటిల్లిపాదికన్నీ "ఇతను వెడుతున్నాడు! ఇక్కడికి వెడుతున్నాడు?" అనే మీమాంసకన్న "ఏం శకునం ఎదురొస్తువుందా ఇతగాడికి?" అనేదే హెచ్చు మీమాంస.